శతకాలు

# సుమతి శతకం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తెలుగు భక్తి వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ ఫౌండేషన్ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తెలుగు భక్తి వారి వెబ్ సైట్: www.telugubhakti.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తెలుగు భక్తి వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## తెలుగు భక్తి వారి వెబ్ సైట్:

## http://www.telugubhakti.com/



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఙవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# సుమతీ శతకము(తాత్పర్య సహిత)

బద్దెన

# సుమతీ శతకము

## (టీకాతాత్పర్యసహితము)

ఈ సుమతీ శతక కర్త బద్దెన. 13 వ శతాబ్దికి చెందినవాడు. ఈ శతక కర్త చెప్పిన నీతులు ఆకాలానికే కాదు ఎప్పటికీ ఔనన్ విధంగా తీర్చిదిద్దాడు.

1. శ్రీ రాముని దయచేతను
   నారూఢిగ సకల జనులు నౌరా యనగాఁ
   ధారళమైన నీతులు
   నోరూరగఁ జవులుబుట్ట నుడివెద సుమతీ.

తన శతక స్వభావాన్ని పూరించే విధంగా మొట్ట మొదటి పద్యంలోనే చెప్పాడు. తను చెప్పటం లేదట. శ్రీరాముని దయ చెప్పిస్తోందట. ఏ విధంగా అంటే అఖిల లోకము, ఎల్ల జనులు మెచ్చుకొనే విధంగా 'ఔరాయనంగా' ఎన్నో నీతులు నోటిలో నించి ధారా పాతంగా వస్తాయట. నోటిలో నీరు ఏవిధంగా వూరుతుందో తన కలంలోంచి (గంటం లోంచి) ఆ విధంగా నీతులు వస్తాయట. చదివే వాడు (వినే) బుద్దిమంతుడైతేనే ఇవి రుచిస్తాయిట అందుకనే 'సుమతీ' అనే మకుటం ఎన్నుకొన్నాడు.

2. అక్కరకురాని చుట్టము,
   మ్రొక్కిన వరమీని వేల్పు, మోహరమునఁ దా
   నెక్కిన బాఱని గుఱ్ఱము,
   గ్రక్కున విడువంగవలయుఁగదరా సుమతీ,

ఏవేవి వెంటనే వదలి వేయాలో చిన్న చిన్న మాటలలో మనసుకి హత్తుకునే విధంగా ఈ పద్యంలో చెప్పాడు. అవసరానికి పనికి రాని చుట్టాన్ని, ఎన్ని వేడుకున్నా వరమీయని దైవాన్ని, యుద్ధంలో తానెక్కినా పరుగెత్తని గుఱ్ఱాన్ని నీతిమంతుడు వెంటనే వదలి వేస్తాడు.

3. అడిగిన జీతం బియ్యని
మిడిమేలపు దొరనుఁగొల్చి మిడుకుట కంటెన్
వడిగల యెద్దుల గట్టుక
మడి దున్నుక బ్రతకవచ్చు మహిలో సుమతీ.

తన పనికి తగిన వేతనము, తను అడిగిన జీతము ఇయ్యక కష్టపెట్టే యజమానిని వదలి వేసి రెండుమంచి ఎడ్లని కాడి గట్టుకొని వ్యవసాయం చేసి బతుక గల్గిన వాడే నీతిమంతుడు పనికి తగిన ఫలితం లేక పోతే ఎందుకా కొలువు. కాయకష్టం చేసినా కందమూలాలు ఏరుకొని తిన్నా బతుకగలవు కదా !

4. అడియాస కొలువుఁ గొలువకు,
గుడిమణియముఁ సేయఁబోకు, కుజనుల తోడన్
విడువక కూరిమి సేయకు
మడవినిఁ దో డరయ కొంటి నరుగకు సుమతీ.

ఏవేవి కూడదో చిన్ని చిన్ని మాటలతో బాలురకు అర్థమయే విధంగా తెలుపుతున్నాడు. నీకిది చేస్తాను, అది చేస్తాను అని అతిగా ఆశ పెట్టి చేయించే పని, దేవాలయాల మీద అధికారము, చెడ్డ వారితో మైత్రి అడవులలో ఒంటరి సంచారము కూడనివి.

5. అధరము కదలియుఁగదలక
మధురములగు భాషలుడిగి మౌనవ్రతుడౌ,
నధికార రోగపూరిత
బధిరాంధక శవముఁజూడ బాపము సుమతీ.

ఎవరిని చూస్తేనే పాపము వస్తుందో వివరణ ఇవ్వబడింది అధికారమనే రోగంతో బాధ పడుతూ, చెవులు వినిపించక, కనులు కన్పించక, నోరున్నను మూగవానివలె పలుకాడ లేక శవమువలె బడియున్న వానిని చూడరాదని భావము

6. అప్పగొనిచేయు విభవము
ముప్పున బ్రాయంపుటాలు, మూర్ఖుని తపమున్,
ద ప్పరయని నృపురాజ్యము
దెప్పరమై మీఁద గీఁడు దెచ్చుర సుమతీ.

ఏవేవి తరువాత కీడు తెస్తాయో వివరింపబడింది. వేడుక చేసుకొనేందుకు చేయు అడ్డు, ముసలితనములో వయసులో వున్న భార్య, తెలివి లేనివాడు చేయు తపము తప్పు విచారణ చేయకయే శిక్షించు రాజు యొక్క రాజ్యము భరింపలేని విధంగా వుండి రాబోయే కాలమున కీడు తెస్తాయి.

7. అప్పిచ్చువాడు, వైద్యుడు,
నెప్పుడు నెడతెగక బాఱు నేఱును, ద్విజుఁడున్
జొప్పడిన యూర నుండుము,
చొప్పడకున్నట్టి యూరు సొరకుము సుమతీ.

పూర్వకాలంలో ప్రయాణ సాధనాలు లేనప్పుడు వున్న వూరు దాటి పాదసంచారం చేయ లేని రోజులలోని నీతులు ఇవి. కాని కొన్ని ఈ రోజులలో కూడ వర్తిస్తాయి. అవసరం కలి గిన వేళలో అప్పిచ్చువాడు, నేర్పరి అయిన వైద్యుడు, నీటి వసతి, (ఎల్లప్పుడు పారే ఏరు) మంత్రం చెప్పే బ్రాహ్మణుడు, మంచికార్యాలు నిర్వహించే బ్రాహ్మణుడు ఇవన్నీ వున్న వూరిలో వుండమని హితవు లేనిచోట వుంటే వచ్చేకష్టాలకి నీవే కారకుడవు అవుతావు.

8. అల్లుని మంచితనంబును,
గొల్లని సాహిత్యవిద్య, కోమలి నిజమున్
బొల్లున దంచిన బియ్యముఁ,
దెల్లని కాకులును లేవు తెలియము సుమతీ.

ప్రపంచములో లేని వింతలంటూ అల్లుని యొక్క మంచితనము, గొల్లవాడు సాహిత్య విద్య నేర్పటము, స్త్రీ నిజము చెప్పట, ఊకను దంచగా వచ్చు బియ్యము, తెల్లని కాకు

లను పేర్కొన్నారు. కాని నేటి ప్రపంచములో మొదటి మూడు అబద్ధములని తెలియ చేసే మనుజులెందరో కన్పిస్తున్నారు. ఇది కాలానికనుగుణమయిన మార్పని సరిపెట్టుకోవచ్చు.

9. అఁకొన్న కూడె యమృతము,
తాఁకొంకక నిచ్చువాఁడె దాత ధరిత్రిన్
సోకోర్చువాఁడె మనుజుడు,
తేఁకువగలవాడె వంశ తిలకుఁడు సుమతీ.

మంచి ఆకలి మీద వున్నప్పడు గడ్డికూడ అమృతము వంటి రుచి కలిగి వుంటుంది వెనక, ముందు ఆలోచించక అడిగిన వారికి కష్టములలో నున్నవారికి ఇయ్యగలిగిన వాడే దాత. కష్టనష్టములకు కుంగిపోక సదా చిరునవ్వు చెదరనీయని స్థిత ప్రజ్ఞుడే అసలయిన మానవుడు. అతడే కులమునకు పేరు తెచ్చు వంశతిలకుడు.

10. ఆఁకలి యుడుగని కడుపును
వేఁకటియగు లంజ పడుపు విడువని బ్రతుకున్
బ్రాఁకొన్న నూతి యుదకము
మేకల పాడియును రోఁత మేదిని సుమతీ.

అసహ్యకరమయినవి జుగుప్సాకరమయినవి ఆకలిబాధ తీర్చని భోజనము, వేశ్యతో కలయిక, పాతబావిలో పాచి పట్టిన కలుషితమయిన నీరు, మేకపాలు మొదలగునవి. కాని నేడు Pizzas, Pastries వంటి Junk food. Aids ఆలోచనలేని కలయికలు, Polluted Water సర్వసామాన్యమయినాయి.

11. ఇచ్చునదె విద్య, రణమునఁ
జొచ్చునదే మగతనంబు, సుకవీశ్వరులున్
మెచ్చునదె నేర్పు, వాదుకు
వచ్చునదే కీడుసుమ్ము! వసుధను సుమతీ.

ఇతరులకు చెప్పగలిగినటువంటిదే విద్య. అలా చెప్పగల్గిననే విద్యావంతుడు. యుద్ధ ములో చొచ్చుకు పోగల్గిననే ధీరుడు. మతిమంతులయిన, గుణవంతులయిన కవులు మెచ్చినదే కవిత్వము. అనవసరమయిన వాదులాటలకు చోటిచ్చుటయే కీడు. అట్టి వాదోపవాదములకు దిగకుండుటయే నేర్పరితనము.

12. ఇమ్ముగఁజదువని నోరును
'అమ్మా' యని పిలిచి యన్న మడుగని నోరున్,
దమ్ములఁమబ్బని నోరును
గుమ్మరి మను ద్రవ్వినట్టి గుంటర సుమతీ.

చక్కని తేట తెలుగు అర్థవంతములయిన మాటలతో చక్కగ చదువలేని నోరు, 'అమ్మా' అని పిలువగలేని నోరు, తాంబూల చర్వణము చేయని నోరు కుమ్మరి గుంటతో సమా నము.

13. ఉడుముండదె నూఱేండ్లనుఁ
బడియుండదె పేర్మిఁబాము పదినూఱేండ్లన్
మడువునఁగొక్కెర యుండదె
కడునిలఁ బురుషార్థపరుఁడు గావలె సుమతీ.

మంచిపనులు చేయుటయందు అనురక్తి కలిగి చతుర్విధ పురుషార్థములను సాధించగల్గిన వ్యక్తి జీవితమే సార్థకము అలా చేయలేని మనిషి ఎన్నేళ్ళు ఉడుము, పాము, కొంగలా జీవించినా వ్యర్థుడే.

14. ఉత్తము గుణములు నీచున
కెత్తెఱఁగున గలుగనేర్చు నెయ్యెడలన్ దా
నెత్తిచ్చి కఱఁగి పోసిన
నిత్తడి బంగార మగునె యిలలో సుమతీ.

ఎన్ని ప్రయత్నములు చేసినా ఇత్తడి బంగారము కానట్లే నీచులకు ఎన్ని నీతులు నూరి పోసినా ఉత్తముడు కాజాలడు.

15. ఉదకముఁ ద్రావెడు హయమును,
మదమున నుప్పొంగుచుండ మత్తేభంబున్,
మొదవుకడ నున్న వృషభముఁ
జదువని యా నీచుకడకుఁ జనకుర సుమతీ.

ఎవరెవరి వద్దకు పోతే అపకారము జరుగుతుందో ఈ పద్యంలో వివరంగా వర్ణించాడు. నీరుత్రాగే గుఱ్ఱము, కొవ్వెక్కి మదముతో వుండే ఏనుగు, ఆవు దగ్గరకువస్తున్న ఆంబోతు, చదువు నేర్వని హీనుడు వీరందరూ అపకారము కల్గించేవారు.

16. ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాఁడు నేర్పరి సుమతీ.

మనకు సహాయము చేసిన వారికి సహాయపడుట కంటె కీడొనర్చిన వారికి కూడా సహాయపడిన వాడే నేర్పరి.
పాండవులు కౌరవులు దాయాదులైనప్పటికీ గంధర్వులు కౌరవుల మీద దండెత్తినపుడు పాండవులు ధర్మనందనుని మాటమీద కౌరవులకి సాయపడినందునే ఈ నాటికీ వారిని తలుచుకుంటున్నారు.

17. ఉపమింప మొదలు తియ్యన
కపటంబెడ నెడను జెఱకు కైవడినే పో
నెపములు వెదకునుఁ గడపటఁ
గపటపు దుర్జాతి పొందు గదరా సుమతీ.

చెడ్డవారితో స్నేహము మొదట తీయగా నున్నను చివరలో హానినే కల్గించును (చెరకు మొదట తీయగా, మధ్యలో కణుపుల వద్ద తీపిహరించి చివర చేదుగా వుండు నట్లుగా)

18. ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటి కామాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుఁగువాఁడె ధన్యుఁడు సుమతీ.

వివేకము కల్గినవాడు సమయోచితములగు మాటలతో ఇతరులను నొప్పింపక తనపని ముగించుకొనును.

19. ఎప్పడు దప్పలు వెదకెడు
నప్పరుషునిఁ గొల్వఁగూడ నది యెట్లన్నన్
సర్పంబు పడగ నీడను
గప్పవసించు విధంబు గదరా సుమతీ.

ఎల్లప్పడూ తప్పలే పట్టే యజమానిని సేవించుట పాము పడగ నీడలో కప్పయున్నట్లే.

20. ఎప్పడు సంపద గలిగిన
నప్పడు బంధువులు వత్తు రది యెట్లన్నన్
దెప్పలుగఁ జెఱువు నిండినఁ
గప్పలు పదివేలు చేరుఁగదరా సుమతీ.

చెరువు నిండుగా వున్నప్పడు కప్పలు నిండియున్నట్లే ధనవంతుని కడ బంధువులు మిత్రులు వందమంది చేరుదురు.

21. ఏఱకుమీ కసుగాయలు

దూఱకుమీ బంధుజనులఁ, దోషము సుమ్మీ!
పాఱకుమీ రణమందున,
మీఱకుమీ గురువులాజ్ఞ, మేదిని సుమతీ.

చేయకూడని పనులను వరుస క్రమంగా ఈ క్రిందుగా చెప్తున్నాడు. పిందెలను కోయ కూడదు బంధువులను తిట్టకూడదు యుద్ధమునించి పారిపోకూడదు గురువుల, పెద్దల మాట అతిక్రమించకూడదు, త్రోసిపుచ్చకూడదు.

22. ఒక యూరికి నొక కరణము
నొక తీర్పరియైనగాఁక నొగిఁ దఱుచైనన్
గకవికలు గాక యుండునె?
సకలంబునుఁగొట్టుపడక సహజము సుమతీ.

ఒక వూరిలో పెద్ద యొకడే వుండాలి. పదిమంది వుంటే అల్లకల్లోలమవుతుంది.

23. ఒల్లని సతి నొల్లని పతి
నొల్లని చెలికాని విడువ నొల్ల నివాఁడే
గొల్లండుఁ గాక ధరలో
గొల్లండుఁను గొల్లడౌనెగుణమున సుమతీ.

అజ్ఞాని అని పూర్వము గొల్లలను అనేవారు. గొల్ల అంటే ఒక కులము కాదు. అజ్ఞాని అంటే తానంటే ఇష్టపడని భార్యను ఇష్టములేని స్నేహితుని తనని నమ్మని ప్రభువును విడచుటకు ఒప్పనివాడు.

24. ఓడలఁ బండ్లును వచ్చును
ఓడలు నాబండ్లమీదఁ నొప్పగ వచ్చున్
ఓడలు బండ్లును వలెనే
వాడంబడుఁ గలిమిలేమి వసుధను సుమతీ.

కలిమి లేములు కావడి కుండల వంటివి ఒకదాని వెంటనే మరొకటివుండును కలిమిలో పొంగిపోక లేమిలో కుంగిపోని వాడే మనుజుడు.

25. కడు బలవంతుడైననుఁ
బుడమినిఁ బ్రాయంపుటాలిఁ పుట్టిన యింటన్
దడవుండ నిచ్చెనేనియుఁ
బడుపుగఁ నంగడికిఁదానె బంపుట సుమతీ.

పెళ్ళిచేసుకున్న పురుషుడు తన ఆలిని బహుకాలము విడచిన తానే ఆమెని వేశ్యని కమ్మన్నట్లు.

26. కనకపు సింహాసనమున
శునకమునుఁ గూర్చుండఁబెట్టి శుభలగ్నమునన్
వొనరగఁబట్టముఁ గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ.

నీచగుణములు కల్గిన వారికి ఉన్నత పదవులు వచ్చినను తమ నీచత్వమును వదలలేరు.

27. కప్పకు నొరగాలైనను,
సర్పమునకు రోగమైన, సతి తులువైనన్,
ముప్పున దరిద్రుడైనను
తప్పదు మఱి దుఃఖమగుట తథ్యము సుమతీ.

దుఃఖము కలుగుటకు హేతువులు చాల వున్నాయి ఎవరి దుఃఖము వారికి గొప్ప. కప్పకి కాలు విరిగిన పాముకి దీర్ఘవ్యాధి కలిగిన భర్తకు భార్యగయ్యాళైన, వృద్ధాప్యమున దరిద్రము మిక్కిలి శోకకారణాలు.

28. కమలములు నీట బాసినఁ
గమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
దమ తమ నెలవులు దప్పినఁ
దమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ.

ఎవరు వుండవలసిన చోటులో వారు వుంటే అందరు క్షేమంగా వుంటారు. చోటు మార్చిన మిత్రులే శత్రువులవుతారు. (తామరపూలకు సూర్యునికి మిత్రత్వము. కాని అదే తామరలు నీరులేని చోటవుంటే సూర్యునివేడికి కమలి పోతాయి).

29. కరణముఁగరణము నమ్మిన
మరణాంతక మౌనుగాని మనలేడు సుమీ
కరణము దనసరి కరణము
మరి నమ్మక మర్మమీక మనవలె సుమతీ.

కరణము (లేఖకుడు) ఇంకొక కరణమును కూడ నమ్మక, తన గుట్టెవరికిని తెలియనీక బతుకవలెను.

30. కరణముల ననుసరింపక
విరసంబునఁ దిన్నతిండి వికటించుఁజుమీ,
యిరుసునఁ గందెన బెట్టక
పరమేశ్వరు బండియైనఁ బాఱదు సుమతీ.

బండి ఇరుసులో కందెన లేక బండి పరుగిడలేదు. అట్లే కరణము లేకయున్న కష్టములు సంభవించును.

31. కరణము సాధై యున్ననుఁ
గరిమదముడిగిననుఁ, బాము గఱవకయున్నన్
ధరఁ దేలు మీటకున్ననుఁ

గరమరుదుగ లెక్కగొనరుగదరా సుమతీ.

మెతక స్వభావము అన్నివేళలా పనికిరాదు. సమయాసమయములను బట్టి కరకు తనము కూడ అవసరము.

32. కసుగాయఁ గఱచి చూచిన
మసలకఁతగు యొగరుఁగాక మధురంబగునా?
పస గులుగు యువతులుండగఁ
బసిబాలలఁబొందువాడు పశువుర సుమతీ.

పశువైతేనే పసి బాలలను అనుభవిస్తాడు. పక్వమునకు వచ్చిన పండ్లువుండగా పిందెల ను కోయనట్లే వయసు వచ్చిన వారే అనుభవయోగ్యులు.

33. కవి గానివాని వ్రాతయు
నవరసభావములు లేని నాతులవలపున్
దవిచి చని పంది నేయని
వివిధాయుధకౌశలంబు వృథరా సుమతీ.

ఎవరెవరి విద్యా కౌశలములు పనికిరావో ఇచట తెలపబడింది. కవి కాని వాడు చేయు రచనలు: వివిధ భావముల పలికించలేని స్త్రీ ప్రేమ; అడవిపందిని కొట్టలేని పురుషుల నైపుణ్యము.

34. కాదు సుమీ దుస్సంగతి
పోదుసుమీ కీర్తికాంత పొందిన పిదపన్
వాడు సుమీ యప్పిచ్చుట
లేదుసుమీ సతులవలపు లేశము సుమతీ!

చెడు స్నేహములు కూడదు. దానివలన వచ్చే కీర్తి పోదు. అప్పు ఇచ్చుట శత్రుత్వమునకు మూలము. దీని మూలమున స్త్రీ వలపునిల్వదు.

35. కాముకుడు దనిసి విడిచినఁ
కోమలిఁ బరవిటుఁడు గవయఁ గోరుటయెల్లన్
బ్రేమమునఁ జెఱుకు పిప్పికిఁ
జీమలు వెస మూగినట్లు సిద్ధము సుమతీ.

వేశ్యల కలయిక నిషిద్ధమని ధ్వని. ఒక పురుషుడు భోగించి వదలిన స్త్రీని ఇంకొకడు కోరిన చెరకు పిప్పిని కోరిన చీమ అని భావము.

36. కారణము లేని నగవునుఁ
బేరణము లేని లేమ పృథివీస్థలిలోఁ
బూరణము లేని బూరెయు
వీరణములు లేని పెండ్లి వృథరా సుమతీ.

వృధాగా వ్యర్థముగా వుండేవి - ఏదైన కారణము లేక నవ్వే స్త్రీ, లోపల ఏమీ పెట్టకుండా వుండే బూరె, వాద్యములు లేని వివాహము మొదలగునవి.

37. కులకాంతతోడ నెప్పడుఁ
గలహింపకుఁ వట్టి తప్ప ఘటియింపకుమీ
కలకంఠి కంటి కన్నీ
రొలికిన సిరి యింటనుండ దొల్ల దు సుమతీ.

కలకంటి (ఉత్తమ జాతిస్త్రీ) బాదపడితే ఇంట్లో సుఖము శాంతి వుండవు. కారణము లేకుండా భార్యను బాధింపకూడదు.

38. కూరిమిగల దినములలో
నేరములెన్నడును గలుగ నేరవు మఱి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ.

మనకు అవతల మనిషి మీద ప్రేమ యున్నచో అతను ఏమి తప్పు చేసినా తప్పవలె కన్పింపదు. ప్రేమలేని చోట తప్పలే కన్పిస్తాయి. సాధ్యమయినంత వరకు కూరిమినే పాటించమని చెప్పనదే పద్యము.

39. కొంచెపు నరు సంగతిచే
నంచితముగ గీడువచ్చు నది యెట్లన్నన్
గించిత్తు నల్లి కఱచిన
మంచమునకు బెట్టువచ్చు మహిలో సుమతీ

చెడ్డవారితో చెలిమి మనకు కూడ చేటు తెచ్చునది ఎట్లనగా చిన్ని నల్లి కుట్టినను మంచమును తన్ను విధాన.

40. కొక్కోక మెల్ల జదివిన
చక్కనివాడైన రాజ చంద్రుండైనన్
మిక్కిలి రొక్కము నీయక
చిక్కదురా వారకాంత సిద్ధము సుమతీ.

వారకాంతల (వేశ్యలు)కు అచ్చమయిన ప్రేమ వుండదని వారి ప్రేమ కాసులపైనయేనని తెల్పునదీ పద్యము. రతిశాస్త్రము ఎంత చదివనా, గొప్ప అందగాడైనా, రాజాధిరాజైనా ధనమీయనిదే వేశ్య లభించదు.

41. కొఱగాని కొడుకు పుట్టిన
గొఱగామియెగాదు తండ్రి గుణములజెఱచున్

జెఱకుతుద వెన్ను పుట్టినఁ
జెఱకునఁ తీపెల్ల జెఱచు సిద్ధము సుమతీ.

చెరకును వెన్ను తినివేసి (తీపి లేకుండా) న విధంగా చెడ్డ పుత్రుడు తండ్రి మంచి గుణములను కూడా తినివేయును.

42. కోమలి విశ్వాసంబునఁ
బాములతోఁజెలిమిఁయన్య భామల వలపున్,
వేముల తియ్యదనంబును,
భూమీశుల నమ్మికులను బొంకుర సుమతీ.

ప్రపంచములో అసత్యములైనవి - స్త్రీ విశ్వాసము, వేపచెట్టు తీపి, పరస్త్రీల ప్రేమ, రాజు యొక్క నమ్మకం, పాముల స్నేహం.

43. గడనగల మగనిఁ జూచిన
నడుగడుగున మడుగులిడుదు రతివలు ధరలోఁ
గడునుడగు మగనిఁజూచిన
నడపీనుఁగు వచ్చెననుచ నగుదురు సుమతీ.

సంపాదన లేని పురుషుని స్వంత తల్లియు, భార్యయు కూడ తూలనాడుదురని భావము

44. చింతింపకు కడచినపని
కింతులు వలతురని నమ్మకెంతయు మదిలో
నంతఃపుర కాంతలతో
మంతనములు మానుమిదియె మతముర సుమతీ.

గతం గురించి చింతిపకు, స్త్రీలు ప్రేమిస్తారని నమ్మకు. అంతఃపురకాంతలతో మంత నాలు చేయకు. ఇదే మంచిపని.

45. చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరవైనయట్లు పామరుఁడుదగన్
హేమంబుఁ గూడఁ బెట్టిన
భూమీశుల పాలఁజేరు భువిలో సుమతీ.

ఎంతయో కష్టపడి, ఎన్నో శ్రమల కోర్చి ధనమును కూడబెట్టినా బలవంతులు దానిని సంగ్రహిస్తారు. చీమలు పెట్టిన పుట్టలు పాములు ఆక్రమిస్తాయి. పిసినారి కూడ పెట్టిన ధనం భూపాలురు పరం మౌవుతుంది.

46. చుట్టములు గానివారలు
చుట్టములముఁ నీకటంచు సొంపుదలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిన ద్రవ్యంబు గలుగఁ గదరా సుమతీ.

నీ దగ్గర ధనముంటే ఏదో రకంగా చుట్టమంటూ వచ్చి వ్యయము చేయిస్తారు. జాగరూకత అవసరమని ఈ రెండు పద్యాల భావము.

47. చేతులకు తొడవు దానము.
భూతలనాథులకుఁదొడవు బొంకమి, ధరలో
నీతియె తోడ వెవ్వారికి,
నాతికి మానంబు తొడవు, నయముగ సుమతీ.

అసలైన ఆభరణంబులు ఏవనగా
1. చేతులకు - దానము
2. పాలకులకు - నిజము
3. మనిషికి - నీతి
4. స్త్రీకి (పురుషునికి) - శీలము

48. తడవోర్వక యొడలోర్వక
కడువేగం బడఁచిపడిన గార్యంబగునే
నీతియె తోడ వెవ్వారికి,
జెడిపోయిన కార్యంబెల్లఁ జేకురు సుమతీ.

తలఁచిన వెంటనే తాత పెళ్ళి కావాలనక శ్రమ దయాదుల కోర్చి కష్టపడిననే ఏ పని అయినా జరుగును.

49. తనకోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము
తనదుఃఖమె నరకమండ్రు, తథ్యము సుమతీ.

మనిషికి తనలోని గుణములే శత్రువులు, మిత్రులుగను వుండును. తన కోపమె శత్రువు దయ చుట్టము. తన గుణములను అదుపులో పెట్టుకున్నవాడే మనిషి.

50. తనయూరి తపసితనమును
దనబుత్రుని విద్యపెంపుఁ, దన సతి రూపున్,
దన పెరటి చెట్టు మందును,
మనసున వర్ణింపరెట్టి మనుజులు సుమతీ.

తన ఊరి తపోనిష్ట, తన కొడుకు ఉన్నత చదువు, తన భార్య అందచందాలు తన పెరటి చెట్టు ఔషధగుణము. ఇవేవి మానవుడు గొప్పగా భావించలేడు.

51. తన కలిమి యింద్రభోగము,
తనలేమియె సర్వలోక దారిద్ర్యంబున్
తన చావు జగత్ప్రళయము

తను వలచిన యదియెరంభ తథ్యము సుమతీ.

తన కలిమి ఇంద్రభోగమనుకొనుట, తన లేమి అత్యంత దయనీయమైనదనుకొనుట, తన చావు జగత్ప్రళయమని,తను ఇష్టపడినామె జగదేకసుందరని భ్రమ పడుట అరుదు.

52. తనవారు లేనిచోటను
జనవించుక లేనిచోట జగడము చోటన్,
అనుమానమయిన చోటను,
మనుజున కట నిలువఁదగదుఁ మహిలో సుమతీ.

తన వారు లేని చోట, చనువు లేని చోట, కలహించే చోట, అవమానమయినచోట, అనువుగాని చోట అధికులమనుకోకూడదు.

53. తమలము వేయని నోరును
విమతులతోఁ జెలిమి జేసి వెతఁబడు తెలివిన్
గమలములు లేని కొలనుకును
హిమధాముఁడులేని రాత్రి హీనము సుమతీ.

అల్పమయినవి, నీచమయినవి - తమలము వేయని నోరు, తామరలేని చెరువు, చంద్రుడులేని రాత్రి, విరోధులతో మిత్రత్వము మొదలగునవి.

54. తలనుండు విషము ఫణికిన్
వెలయంగాఁ దోకనుండు వృశ్చికమునకున్
దల దోఁక యనకనుండును
ఖలునకు నిలువెల్ల విషముగదరా సుమతీ.

పాముకు తలలో విషముంటుంది. తేలుకు తోకలో విషముంటుంది. నీచమయిన జంతువులకు వేరు వేరు చోట్ల విషముంటుంది. అప్పడు వాని పట్ల జాగ్రత్తగా నుండవచ్చును. నీచులకు ఒడలంతా విషమే అనగా నీచత్వమే నిండియుండును. వానితో స్నేహము

వలన కీడే జరుగును.

55. తలపొడుగు ధనము బోసిన
వెలయాలికి నిజములేదు వివరింపంగా
దలఁదడివి బాసఁజేసిన
వెలియాలిని నమ్మరాదు వినరా సుమతీ.

నిలువెత్తు ధనము కుమ్మరించినా వ్యభిచారి నిజము పలుకదు. తలపైచేయి పెట్టి ప్రమాణము చేసినా వేశ్యలను ఎట్టి పరిస్థితులలో నమ్మరాదనుభావము

56. తలమాసిన, వొలు మాసినఁ,
వలువలు మాసిననుఁ బ్రాణవల్లభు నైనన్
కులకాంతలైన రోఁతురు,
తిలకింపగ భూమిలోన దిరముగ సుమతీ.

మాసిన తల, బట్టలు శరీరముతో ఉంటే ప్రాణవల్లభునైన సొంత భార్యలు కూడ అసహ్యించు కొందురు.

57. తాననుభవింప నర్థము
మానవపతిజేరు గొంత మఱి భూగతమౌ
గానల నీగలు గూర్చిన
తేనియ యొరుజేరునట్లు తిరముగ సుమతీ.

మనుజుడనుభవింపని ధనము వృధాయగునది ఎట్లనగా ఈగ కూడ బెట్టిన తేనె చందముగా.

58. దగ్గర కొండెము చెప్పెడు
ప్రెగ్గడ పలుకులకు రాజు ప్రియుడై మఱి తా

నెగ్గు బ్రజ కాచరించుట
బొగ్గులకై కల్పతరువు బొడుచుట సుమతీ.

చెప్పుడు మాటలు విని ఇతరులకు హాని చేయుట కోరి కల్పవృక్షము నరికినట్లే

59. ధనపతి సఖుడై యుండియు
నెనయంగా శివుడు భిక్ష మెత్తగ వలసెన్
దనవారి కెంత గలిగిన
తనభాగ్యమె తనకు గాక తథ్యము సుమతీ.

తన మిత్రులు బంధువులు ఎంతటి వారైనప్పటికీ తనకు వుండు సంపదయే తనకు దక్కును.

60. ధీరులకుఁజేయు మేలది
సారంబగు నారికేళ సలిలము భంగిన్
గౌరవమును మఱి మీఁదట
భూరిసుఖావహము నగును భువిలో సుమతీ.

బుద్ధిమంతులకు చేసిన మేలు తనకే శుభమది ఎట్లనగా కొబ్బరిచెట్టుకు పోసిన నీరు మంచి కొబ్బరికాయలిచ్చినట్లుగా.

61. నడువకుమీ తెరువొక్కటఁ
గుడువకుమీ శత్రునింట గూరిమితోడన్
ముడువకుమీ పరధనముల
నుడువకుమీ యొరుల మనసు నొవ్వగ సుమతీ.

చేయకూడని పనులు ఒంటరిగా మార్గమున నడుచుట, విరోధి ఇంట భుజించుట, ఇతరుల ధనమును దొంగిలించుట, ఇతరులను నొప్పించుట.

62. నమ్మకు సుంకరి, జూదరి,
నమ్మకు మగసాలివాని, నటువెలయాలిన్,
నమ్మకు మంగడివానిని,
నమ్మకుమీ వామహస్తు నవనిని సుమతీ.

పన్నులు వసూలు చేయువానిని జూదమాడేవారిని, కంసాలిని, వేశ్యను, సరుకులమ్ము వారిని, ఎడమచేతితో పనిచేయువారిని నమ్మకూడదు.

63. నయమున బాలుం ద్రావరు
భయమున విషమ్మునైన భక్షింతురుగా
నయమెంత దోసకారియొ
భయమే చూపంగవలయు బాగుగ సుమతీ.

కొన్నివేళల భయమును చూపించనిచో పనులు జరుగవు. అన్ని వేళల మంచితనము పనికిరాదు.

64. నరపతులు మేర దప్పిన,
దిరమొప్పగ విధవ యింట దీర్ఘరియైనన్,
గరణము వైదికుఁడైనను,
మరణాంతక మౌనుగాని మానదు సుమతీ.

ప్రాణము పోవునటువంటి కష్టము రాజు ధర్మము యొక్క హద్దు మీరినపుడు, విధవ ఇంట్లో ఎల్లవేళల అధికారము చెలాయించిన, గ్రామ కరణము వైదిక వృత్తి కలిగినను కల్గును.

65. నవరస భావాలంకృత
కవితా గోష్టియును, మధుర గానంబును, దా
నవివేకి కెంత జెప్పిన

జెవిటికి సంకూదినట్లు సిద్ధము సుమతీ.

చెవిటివాని ముందు శంఖమూదిన విధముగా తెలివి లేనివారికి మంచి పాటగాని కవిత్వముగాని రుచించదు.

66. నవ్వకుమీ సభలోపల
నవ్వకుమీ తల్లిదండ్రి నాథులతోడన్,
నవ్వకుమీ పరసతులతో,
నవ్వకుమీ విప్రవరుల నయమిది సుమతీ.

హాస్యములాడకూడని చోట్లు, మనుజుల గురించి వివరింపబడెను. సభలందు, తల్లిదండ్రులతో, రాజు దగ్గర, బ్రాహ్మణోత్తముల దగ్గర హాస్యము కూడదు.

67. నీరే ప్రాణాధారము,
నోరే రసభరితమైన నుడువుల కెల్లన్,
నారే నరులకు రత్నము
చీరే శృంగారమండ్రు, సిద్ధము సుమతీ.

అన్ని జీవులకు నీరే ఆధారము. రసవంతమైన పలుకులు పలుకుటకు నోరే ఆధారము. ఆడువారే సర్వజనులకు రత్నము. వస్త్రమే శృంగారమునకు ముఖ్యము.

68. పగవల దెవ్వరితోడను,
వగవంగా వలదు లేమి వచ్చిన పిదపన్,
దెగనాడవలదు సభలను,
మగువకు మన సియ్యవలదు మహిలో సుమతి.

కూడని పనులు - శత్రుత్వము, పేదరికము వలని దుఃఖము, సభలలో పరుషభాషణ, స్త్రీలకు మనసులో వలపు తెలుపుట.

69. పతికడకు, తన్నుఁగూర్చిన
సతికడకును, వేల్పుఁకడకు, సద్గురు కడకున్,
సుతుకడకు, రిత్తచేతుల
మతిమంతులు చనరు, నీతి మార్గము సుమతీ.

నీతిమంతులు యజమాని వద్దకు, తను ప్రేమించిన భార్య వద్దకు, దేవుని సముఖము నకు, గురువు వద్దకు, కొడుకు దగ్గరకు వట్టి చేతులతో వెళ్ళరు

70. పనిచేయు నెడల దాసియు,
ననుభవమున రంభ, మంత్రి యాలోచనలన్,
దనభుక్తి యెడలఁదల్లియు,
యనదగు కులకాంత యుండనగురా సుమతీ.

కులకాంత లక్షణములు మనువు శ్లోకముననుసరించి చెప్పబడెను. ఉత్తమఇల్లాలు - ఇంటిపనుల్లో దాసివలెను, సంభోగసమయములో రంభవలెను, సలహాచెప్పనప్పడు మంత్రిలాగా, భోజన సమయములో తల్లిలాగా వుండాలి.

71. పరనారీ సోదరుఁడై
పరధనముల కానపడక, పరులకు హితుఁడై
పరులుఁ దనుఁబొగడ నెగడకఁ,
బరు లలిగిన నలుగనతఁడు, పరముఁడు సుమతీ.

ఉత్తమ పురుషుడు, పరస్త్రీలను కోరడు, పరుల సంపదనాశించడు. స్తుతులకు పొంగి పోడు. నిందలకు కృంగిపోడు.

72. పరసతి కూటమిఁ గోరకు,
పరధనముల కానపడకు, పరునెంచకుమీ,

సరిగాని గోష్టి చేయకు,

సిరిచెడి చుట్టంబుకడకు జేరకు సుమతీ.

పరభార్యల పొందుకూడదు. పరుల ధనమాశించవద్దు. కల్లబొల్లిమాటలు కట్టి పెట్టు. ధన వంతులైన చుట్టముల వద్దకు చేరకు.

73. పరసతుల గోష్ఠినుండిన

పురుషుఁడు గాంగేయుఁడైన భువిరని దవడున్

బరసతి సుశీలయైనను,

బరుసంగతినున్న నింద పాలగు సుమతీ.

బ్రహ్మచర్యవ్రతము గల భీష్ముడుంతటివాడైనను, ఇతర స్త్రీ ప్రసంగములో పాల్గొన్నచో అప వాదు పాలగును. అట్లే మంచిగుణముగల స్త్రీ యైనను పరపురుషునితో స్నేహముచేస్తే భ్రష్టురాలగును.

74. పరునాత్మఁ దలచుసతి విడు,

మరుమాటలు పలుకు సుతల మన్నింపకుమీ,

వెఱ పెఱుగనిఁ భటు నేలకు

తఱచుగ సతిఁ గవయబోకు, తగదుర సుమతీ.

పరపురుషుని పొందుగోరు భార్య పనికిరాదు. మారుమాట్లాడు కుమారుని దండిం చవలెను. భయపడని సేవకుని వదిలి వేయవలెను. పలుమారులు భార్యతో పొందు మంచిది గాదు.

75. పరుల కనిష్ఠము సెప్పకు,

పొరుగిండ్లకుఁ బనులు లేక పోవకు మెపుడున్

బరుఁగలిగిన సతి గవయకు

మెరిఁగియు బిరుసైన హయము నెక్కకు సుమతీ.

పరులకు ఇష్టముకాని దానిని మాట్లాడకు. ఇతరుల ఇండ్లకు పనిలేకుండా వెళ్ళకు. యిత రులు పొందిన స్త్రీని ఆశించకు. పెంకితనముచేయు గుర్రమును ఎక్కకు.

76. పర్వముల సతుల గవయకు,
ముర్వీశ్వరు కరుణ నమ్మి యుబ్బకు మదిలోన
గర్వింపఁ నాలి బెంపకు
నిర్వాహము లేనిచోట నిలువకు, సుమతీ.

కూడని పనులు- పుణ్యదినముల స్త్రీని కలియుట, రాజు యొక్క దయను నమ్ముట, బాగుపడలేని గ్రామములో నివసించుట.

77. పలుదోమి సేయు విడియము
తలఁగడిననాటి నిద్ర, తరుణుల తోడన్
బొలయలుక నాటి కూటమి
వెల యింతని చెప్పరాదు వినరా సుమతీ.

విలువైనవి - దంతములు తోముకొనిన వెంటనే వేసికొను తాంబూలము, తలంటి తర్వాత నిద్ర, స్త్రీలతో ప్రణయ కలహము తీరిన నాటిపొందు.

78. పా టెరుగని పతి కొలువును,
గూటంబున కెఱుకపడని గోమలి రతియున్,
జేటెత్త జేయు జెలిమియు
నేటికి నెదురీదినట్టు లెన్నగ సుమతీ.

నదికి ఎదురీదుట ఎంత కష్టమో అట్లే పనిపాటల యందు కష్టసుఖము లెరుగని అధికారి సేవ, కీడు కల్గించు మిత్రత్వము మొ॥నవి.

79. పాలను గలసిన జలమును

బాలవిధంబుననె యుండు బరికింపంగా,
బాల చవి జెరుచుగావున
బాలసుఁడగువాని పొందు వలదుర సుమతీ.

చెడ్డవారితో చెలిమి నీలోని మంచిగుణములను కూడ పోగొట్టును. పాలతో నీరు కలిస్తే పాలరుచి తగ్గిపోవును.

80. పాలసునకైన యాపద
జాలింబడి తీర్చతగదు సర్వజ్ఞునకున్
దే లగ్ని బడగ బట్టిన
మేలెరుగునె మీటుగాక మేదిని సుమతీ.

చెడ్డవారిని చేటు కాలములో రక్షించినను వారు చెడుపే చేయుదురు. తేలు నిప్పలో బడినప్పడు రక్షిస్తే అది మేలునెంచక కుడుతుంది.

81. పిలువని పనులకు బోవుట.
గలయని సతి రతియు, రాజు గానని కొలువున్
బిలువని పేరంటంబును,
వలవని చెలిమియును జేయ వలదుర సుమతీ.

చేయకూడని పనులు - ఆహ్వానించని కార్యములకు పోవుట, రాజుచూడని పని, ప్రేమించని స్నేహము, ఇష్టపడని స్త్రీతోభోగించుట.

82. పులికిని బ్రాణము కోమటి,
వరికినిఁ బ్రాణంబు నీరు వసుమతిలోనన్
కరికిని ప్రాణము తొండము
సిరికినిఁ బ్రాణంబు మగువ, సిద్ధము సుమతీ.

ఏవేవి వేని వేనికి అవసరమో వివరింపబడింది.

పురికి (పూరికి) - కోమటి

పంటకి - నీరు

ఏనుగుకు - తొండము

సంపదలకు - స్త్రీ

83. పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు, జనులా
పుత్రుని గనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ.

తండ్రులు కొడుకుని పదిమంది పొగిడినపుడే కొడుకుని కన్న ఆనందము పొందుతారు. ప్రస్తుతము కొడుకులు పుట్టగానే పెద్ద పండుగలు చేసుకొంటున్నారు.

84. పులిపాలు దెచ్చి ఇచ్చిన
నలవడఁగా గుండెగోసి యరచే నిడినన్
దలపొడుగు ధనముఁబోసిన
వెలయాలికిఁగూర్మిలేదు వినరా సుమతీ.

వేశ్య స్త్రీలు నిజమయిన ప్రేమను ఎట్టి పరిస్థితులలో చూపించరు.

85. పెట్టిన దినముల లోపల
నట్టడవులకైన వచ్చు నానార్థములున్
బెట్టని దినములఁ గనకపు
గట్టెక్కిన నేమిలేదు గదరా సుమతీ.

తన పుణ్యఫలము ఎన్ని జన్మలెత్తినా వెంటాడుతుంది. పాపికి భోగాలు కల్గవు.

86. పొరుగునఁ బగవాడుండిన
నిరవొందఁగ వ్రాతకడె యేలికయైనన్
ధరఁగాఁపు గొండెయైనను
గరణాలకు బ్రతకులేదు గదరా సుమతీ.

కరణమునకు బ్రతుకు కలుగవలెనన్న - పొరుగున శత్రువు, వ్రాతకాడు పాలకుడు, రైతు చాడీలు చెప్పవాడు కాకూడదు.

87. బంగారు కుదువఁబెట్టకు
సంగరమునఁ బాఱి పోకు, సరసుడవై తే
సంగడి వెచ్చము లాడకు,
వెంగలితోఁ జెలిమివలదు వినరా సుమతీ.

చేయకూడని పనులు - బంగారము తాకట్టు పెట్టుట,యుద్ధములో వెన్నిచ్చి పారిపోవుట, అప్పచేసి సరకులు కొనుట, అవివేకితో మిత్రత్వము.

88. బలవంతుఁడ నాకేమని
బలువురతో నిగ్రహించి పలుకుట మేలా?
బలవంతమైన సర్పము
చలిచీమల చేతఁజిక్కి చావదె సుమతీ.

దురహంకారము చూపుట నీకే కీడగును. పాము ఎంత బలమైనదైనను చలిచీమలు కుడితే చస్తుంది.

89. మండలపతి సముఖంబున
మెండైన ప్రధానిలేక మెలగుట యెల్లన్
గొండంత మదపుటేనుఁగు
తొండము లేకుండినట్లు తోచుట సుమతీ.

రాజు, మంత్రులు ఇద్దరూ తెలివిగల వారు అయినపుడే రాజ్యము పేరొందును. ఏ ఒక్కరు అవివేకి అయినా ఏనుగుకు తొండములేనట్లే.

90. మంత్రిగలవాని రాజ్యము
తంత్రము సెడకుండ నిలుచుఁదరుచుగ ధరలో
మంత్రివిహీనుని రాజ్యము
జంత్రపు గీ లూడినట్లు జరుగదు సుమతీ.

సమర్థుడయిన మంత్రి వుంటేనే రాజ్యము కకావికలు కాకుండా వుంటుంది.

91. మాటకుఁ బ్రాణము సత్యము,
కోటకుఁబ్రాణంబు సుభట కోటి ధరిత్రిన్
బోటికిఁ బ్రాణము మానము,
చీటికిఁ బ్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ.

మాటకు సత్యమును కోటకు మంచి భటుల సమూహమును, స్త్రీకి శీలమును ఉత్తరమునకు సంతకమును ముఖ్యము.

92. మానధను డాత్మధృతి చెడి
హీనుండగు వాని నాశ్రయించుట యెల్లన్
మానెఁడు జలముల లోపల
నేనుగు యెయిదాచినట్టు లెరుగుము సుమతీ.

ఏనుగు చాలీ చాలని నీళ్ళలో తలదాచుకొన్నట్లు అభిమానము కల్గినవాడు నీచుని సేవించుట.

93. మది నొకని వలచియుండగ,
మదిచెడి యొక క్రూరతిరుగన్

బోది జిలుక పిల్లి పట్టిన
జదువునె యా పంజరమున జగతిని సుమతీ.

స్త్రీ మనసిచ్చిన వానితోనే మాటాడుతుంది గాని ఇతరులు ఎంత ఆకర్షించాలని ప్రయత్నించినా మాట్లాడరు.

94. మెలెంచని మాలిన్యుని,
మాలను, నగసాలెవాని, మంగలిహితుగా
నేలిని నరపతి రాజ్యము
నేల గలసిపోవుగాని నెగడదు సుమతీ.

దుస్సాంగత్యము వలన రాజు నశించిపోతాడు.

95. 'రా, పో'మ్మని పిలువని యా
భూపాలునిఁగొల్వ భుక్తిముక్తులు గలవే?
దీపంబులేని యింటనుఁ
జేపుణికి ఙ్గాడినట్లు సిద్ధము సుమతీ.

దీపములేని ఇంటిలో పట్టు దొరకనట్లే రమ్మని, పొమ్మనని రాజును సేవించినా ఫలితము కల్గదు.

96. రూపించి పలికి బొంకకు,
ప్రాపగు చుట్టంబు కెగ్గు పలుకకు మదిలో
గోపించు రాజుఁ గొల్వకు
పాపపు దేశంబు సొరకు, పదిలము సుమతీ.

కూడని పనులు మాట ఇచ్చి ఇవ్వలేదనుట మేలొనర్చిన వానికి హాని చేయుట, కోపించు యజమానిని సేవించుట, నీచులు సంచరించు ప్రవేశమునకు వెళ్ళుట.

97. లావుగల వానికంటెను
భావింపగ నీతిపరుడు బలవంతుండౌ
గ్రావంబంత గజంబును
మావటివాఁ డెక్కినట్లు మహిలో సుమతీ.

నీతి, న్యాయము కలవాడు బలవంతుని కంటె బలవంతుడు.

98. వఱదైన చేను దున్నకు
కరవైనను బంధుజనులకడ కేగకుమీ,
పరులకు మర్మము సెప్పకు,
పిఱికికి దళవాయితనము బెట్టకు సుమతీ.

బుద్ధిమంతుడు వరదవచ్చి బీడుపడిన పొలమును సాగు చెయ్యడు. పరులకు తన రహస్యమును తెలియనీయడు. ఎంతలేమిలోను బంధువుల దగ్గరకు పోడు పిరికి వానికి ఘనకార్యముల నప్పజెప్పడు.

99. వరిపంటలేని యూరును,
దొరయుండని యూరు, తోడు దొరకని తెరువున్,
ధరను బతిలేని గృహమును,
నరయంగా రుద్రభూమి యనదగు సుమతీ.

వల్లకాటితో సమానమైనవి వరిపంటలేని వూరు, అధికారివుండని గ్రామము మొదల గునవి.

100. వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపఁదగున్
గని కల్ల నిజము దెలసిన
మనుజుఁడెపో నీతిపరుఁడు మహిలో సుమతీ.

నిజమయిన నీతివంతుడు అందరూ చెప్పిన సలహాలను విని తనకు వీలైన దానినే ఆచరించును.

ఈ శతక కారుడు చెప్పిన కొన్ని నీతులను కాలానికనుగుణంగా మార్చుకోవాలి. 3 వ శతాబ్దిలో వుండే రాజులు ఈ 21 వ శతాబ్దిలో కానరారు. కాని ఎంత ప్రజా స్వామ్యంలోనైనా ఏలికలకు కొన్నైనా మంచిగుణములు వుంటే దేశం బాగుపడుతుంది. ఇప్పటి కాలమాన పరిస్థితులు , సాంఘీ ఔనత్య ధృష్ట్యా 'వరిపంటలేని వూరు' అప్పిచ్చు వాడు, వైద్యుడు మొదలగు పద్యముల భావములను అనుగుణం తీసుకోలేము.(వేశ్యలు, కులకాంతలు, బాలికలు) స్త్రీల మీద ఈ శతకకారుడికి వున్న భావాలు 800 ఏళ్ల క్రితం స్త్రీలకి వర్తిస్తాయేమో మనకి తెలియదు. కాని అందులో మంచినే గ్రహించి పనికిరాని వాటిని వదలి వేయుటయే ధీమంతుల లక్షణం.